క్లుప్తంగా

17న టెడెక్స్ హైదరాబాద్

సాక్షి, సిటీబ్యూరో: విజయవంతమైన వ్యక్తుల ప్రసంగాల వేదిక టెడెక్స్ హైదరాబాద్ నగరంలో తమ 9వ ఎడిషన్‌ను ఈ నెల17 నిర్వహించనుంది. ఈ సందర్భంగా నగరంలో గచ్చిబౌలిలో ఉన్న ప్రధాన్ కన్వెన్షన్స్‌లో నిర్వహించే కార్యక్రమంలో ప్రసంగించనున్న 12 మంది భిన్నరంగాలకు చెందిన విజయవంతమైన వ్యక్తుల జాబితాను శనివారం విడుదల చేసింది. వీరిలో నగరానికి చెందిన సస్టెయినబుల్ ఛాంపియన్ కల్పనా రమేష్, పిన్న వయసు పర్వాతారోహకురాలు మలావత్ పూర్ణ, నెఫ్రో ప్లస్ వ్యవస్థాపకుడు కమల్‌షా తదితరులు ఉన్నారు.

పున్నారావుకు 'మ్యాన్ ఆఫ్ ద మంత్' అవార్డు

శేరిలింగంపల్లి: దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ మ్యాన్ ఆఫ్ ద మంత్ అవార్డును లింగంపల్లి రైల్వే స్టేషన్ డిప్యూటీ స్టేషన్ మాస్టర్ టి.పున్నారావు దక్కించుకున్నారు. ఈ మేరకు మంగళవారం జరిగిన కార్యక్రమంలో సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ ఆఫీస్‌లో జరిగిన కార్యక్రమంలో అవార్డును అందజేశారు. విధి నిర్వహణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి అందజేస్తారు. ఈ సందర్భంగా పున్నారావును లింగంపల్లి స్టేషన్‌లో ఉద్యోగులు, అధికారులు అభినందించారు.

ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం



శిక్షణ కేంద్రంలో ప్రారంభ వేడుకలో కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్

బాలానగర్: శాంతి చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కేంద్రాన్ని మంగళవారం బాలానగర్, ఫతేనగర్ కార్పొరేటర్లు ఆవుల రవీందర్‌రెడ్డి, పండాల సతీష్‌గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాలు రాజు కాలనీ, గౌతమ్‌నగర్, ఇందిరాగాంధీ పురంలో ఏర్పాటు చేసి దాదాపు 200 మంది మహిళలకు శిక్షణ ఇవ్వడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇమ్రాన్, డేనియల్, స్వామిదాస్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ పాల్గొనాలి

రాయదుర్గం: విద్యార్థులు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా పాల్గొనాలని ఉర్దూ విశ్వవిద్యాలయ స్టూడెంట్స్ వెల్ఫేర్ చైర్మన్, స్టూడెంట్స్ ఇండక్షన్ ప్రోగ్రామ్ డిప్యూటీ డీన్ డాక్టర్ కేఎం.జియావుద్దీన్ అన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో దీక్షారమ్ ముగింపు కార్యక్రమం సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరగతి గదుల్లో చదవడం, నేర్చుకోవడంతో పాటు అన్ని రంగాలలో కూడా రాణించేలా ప్రయత్నించాలన్నారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ డైరెక్టరేట్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ కలీముల్లా మాట్లాడారు. కార్యక్రమంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఫిర్దౌస్ తబసుమ్, స్పోర్ట్స్ కమిటీ సభ్యులు హబీబ్ అహ్మద్, మ్యూజియం క్యూరేటర్ అమీర్‌బదర్ క్రీడాకారులు, విద్యార్థులు, కోచ్‌లు పాల్గొన్నారు.

సైబర్ వలలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

- ఏసీ రిపేరు కోసం గూగుల్లో శోధించిన ఉద్యోగి
- 2 లక్షల 96 వేలు పోగొట్టుకున్న బాధితుడు

పటాన్‌చెరు టౌన్: ఏసీ రిపేరు కోసం గూగుల్లో శోధించి ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సైబర్ వలలో పడి రూ.2 లక్షల 96 వేలు పోగొట్టుకున్నాడు. పటాన్‌చెరు పోలీసుల కథనం ప్రకారం.. పటాన్‌చెరు మండలం ఇంద్రేశంకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సెప్టెంబర్ తొమ్మిదవ తేదీన ఏసీ రిపేరు చేయించేందుకు గూగుల్లో వెదికాడు.ఈ క్రమంలో ఓ ఫోన్ నెంబర్ దొరకగానే కాల్ చేశాడు.దీంతో అపరిచిత వ్యక్తి చెప్పిన విధంగా తాను యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకుని అపరిచిత వ్యక్తి చెప్పిన విధంగా ఓటీపీలు చెబుతూ వచ్చాడు దీంతో అతని ఖాతాలో ఉన్న రూ.2 లక్షల 96 వేలు మాయమయ్యాయి. దీంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు అనంతరం మంగళవారం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సీఐ జేమ్స్ బాబుకు ప్రశంసా పత్రం

గచ్చిబౌలి: లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారంలో ప్రత్యేక చొరవ తీసుకున్నందుకు గచ్చిబౌలి సీఐ జేమ్స్ బాబుకు సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర మంగళవారం ప్రశంసాపత్రం అందజేశారు. ఈ నెల 9న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించిన విషయం తెలిసిందే. కమిషనరేట్‌లో అత్యధిక కేసుల పరిష్కారానికి గచ్చిబౌలి పోలీసులు కృషి చేశారు.



అడుగడుగునా స్వాగత నీరాజనం

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పాదయాత్రకు విశేష స్పందన
- స్థానిక సమస్యలు, ప్రజల యోగక్షేమాలు తెలుసుకుంటూ ముందుకు సాగిన ఎమ్మెల్యే



కూకట్‌పల్లిలో ఎమ్మెల్యేకు హారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు



ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు స్వాగతం పలికిన స్థానిక జూనియర్ కళాశాల విద్యార్థినులు



ఎమ్మెల్యేకు పొట్టేలు అందజేసి స్వాగతం పలికిన యాదవ బస్తీవాసులు

కూకట్‌పల్లి: డివిజన్‌లోని కూకట్‌పల్లి గ్రామం, యాదవబస్తీ, కుమ్మరిబస్తీ తదితర ప్రాంతాల్లో మంగళవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు అడుగడుగునా ఎమ్మెల్యేకు స్వాగత నీరాజనం పలికారు. స్థానిక కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణతో కలిసి ఆయన గల్లీగల్లీకి వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. కూకట్‌పల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు తన సొంత నిధులతో బ్యాగ్ కిట్లు అందజేశారు. యాదవబస్తీలో పొట్టేళ్లు, దున్నలతో వారి సంప్రదాయనికి అనుగుణంగా ఎమ్మెల్యే కృష్ణారావుకు స్వాగతం పలికారు.

కూకట్‌పల్లి గ్రామానికి ఎంత చేసినా తక్కువే..

◆ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నప్పటి నుంచి తాను ఉంటున్న కూకట్‌పల్లి గ్రామానికి ఎంత చేసినా తక్కువే అని అన్నారు. తనను ఇంతటి వాడిని చేసిన ఈ గ్రామం రుణం తీర్చుకోలేనన్నారు. ఇప్పటికే కూకట్‌పల్లిలో మౌలిక సదుపాయాల్లో ఎక్కడా ఇబ్బంది లేకుండా చూసుకున్నామని తెలిపారు. భవిష్యత్‌లోనూ ఎలాంటి సమస్యలు లేకుండా చూసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా స్థానిక జూనియర్ కళాశాల విద్యార్థినులు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు స్వాగతం పలుకుతూ తమ అభిమానాన్ని చాటుకున్నారు.

అల్లాపూర్ డివిజన్‌లో ముగిసిన ఎమ్మెల్యే పాదయాత్ర

- నాలా విస్తరణ పనులు రెండు నెలల్లో పూర్తి చేస్తామని హామీ

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్‌లో వారం రోజుల నుంచి కొనసాగిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పాదయాత్ర మంగళవారం ముగిసింది.

చివరి రోజు కొత్తూరు సీతయ్యనగర్, రాణాప్రతాప్‌నగర్, శివాజీనగర్ రాధాకృష్ణనగర్, గణేష్‌నగర్, న్యూరామారావు నగర్, వి.రామారావునగర్, హరినగర్‌లలో పర్యటిస్తూ సమస్యలు తెలుసుకున్నారు. స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను వెంటనే అక్కడికక్కడే పరిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వి.రామారావునగర్‌లో నాలా సమస్యతో 4 దశాబ్దాలుగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. తాను గెలిచిన వెంటనే నాలా విస్తరణ పనులను చేయించానన్నారు. ప్రస్తుతం నాలా పైకప్పు వేయాలని మరో రెండు నెలల్లో పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

◆ కార్పొరేటర్ సబిహా బేగం మాట్లాడుతూ... ఇప్పటికే డివిజన్‌లోని అన్ని మతాలకు సంబంధించిన శ్మశానవాటికలను ఎమ్మెల్యే సహకారంతో ఆధునీకరించామన్నారు. అదే విధంగా ప్రతి కాలనీలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తున్నామని అన్నారు. ఎమ్మెల్యే సహకారంతో అందించిన నిధులతో ఎన్నో అభివృద్ధి పనులను చేసుకున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మహమ్మద్ గౌసుద్దీన్, లింగాల ఐలయ్య, తిమ్మారెడ్డి వీరారెడ్డి, నాగుల సత్యం, జ్ఞానేశ్వర్, డి.మస్తాన్‌రెడ్డి, సంజీవ, రామ్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్రీధర్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సమక్షంలో చేరికలు

మూసాపేట: మూసాపేట డివిజన్‌కి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు కర్క స్వామి, కర్క సాయిప్రసాద్‌లు మంగళవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంబటి శ్రీనివాస్, నపారి చంద్రశేఖర్, జెల్ల రాము, పాతపల్లి కృష్ణ, జెల్ల సురేష్, బొమ్మర్తి మల్లేష్, పి. శివశంకర్, బి. విజయ్, నరేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.



గణేశ్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

ట్రాఫిక్ జాయింట్ సీపీ నారాయణ నాయక్

భాగ్యనగర్‌కాలనీ: గణేశ్ నిమజ్జన ఏర్పాట్లలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నట్లు సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ నారాయణ నాయక్ అన్నారు. మంగళవారం హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని అంబీర్ చెరువు గణేశ్ నిమజ్జన ప్రాంతాన్ని కిందిస్థాయి అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. గణేశ్ విగ్రహాలను తీసుకువచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా రూట్ మ్యాప్‌ను రూపొందించినట్లు పేర్కొన్నారు. నిమజ్జనానికి వచ్చే వాహనాలు ఏ రూట్‌లో రావాలి? అదే విధంగా నిమజ్జనం అనంతరం ఏ రూట్‌లో వెళ్లాలి? అనే ప్రణాళిక చేపట్టినట్లు తెలిపారు. నిమజ్జనానికి వచ్చే భక్తులు ట్రాఫిక్ పోలీసులకు సహకరించి నిమజ్జన వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్, అడిషనల్ డీసీపీ వేణుగోపాల్ రెడ్డి, కూకట్‌పల్లి ట్రాఫిక్ ఏసిపి వెంకటయ్య, కేపీహెచ్‌బీ ట్రాఫిక్ సిఐ నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.



అంబీర్ చెరువు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ, అధికారులు

ముమ్మరంగా రోడ్డు నిర్మాణ పనులు

బాలానగర్: రోడ్ల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. అందులో భాగంగా డివిజన్‌లోని అన్ని ప్రాంతాల్లో రోడ్లు నిర్మిస్తున్నామని తెలిపారు. మంగళవారం మసీదు వీధిలో రూ.18లక్షల వ్యయంతో నూతన సీసీ రోడ్డు పనులను జీహెచ్ఎంసీ ఏఈ రషీద్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాములు, స్థానికులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ.. ఎమ్మెల్యే కృష్ణారావు సహకారంతో ప్రతి కాలనీలో నాణ్యమైన రోడ్లు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రోడ్లను సాధ్యమైనంత త్వరగా నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డివిజన్ ప్రదాన కార్యదర్శి మొహమ్మద్ ఖాజా, నాయకులు బాలకృష్ణ, ఎం. సుధాకర్, మొహమ్మద్ ఇర్ఫాన్, మొహమ్మద్ సోఫి, స్థానికులు పాల్గొన్నారు.

సమస్యలు లేని డివిజన్‌గా తీర్చిద్దుతా



సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ సమస్యలపై మంగళవారం స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పాదయాత్ర చేశారు. డివిజన్ పరిధిలోని జన్మభూమి కాలనీ, శివమ్మ కాలనీ, కమలమ్మ కాలనీ, మహావీర్‌నగర్, దత్తాత్రేయ కాలనీ, మహాత్మాగాంధీ నగర్, ఖాజానగర్‌లలో జీహెచ్ఎంసీ అధికారులు, స్థానికులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో అన్ని అభివృద్ధి పనులు 90శాతం ఇప్పటికే పూర్తి చేశామన్నారు. చిన్న చిన్న సమస్యలను పరిష్కరించి సమస్యలు లేని డివిజన్‌గా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను, సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు దొడ్ల రామకృష్ణగౌడ్, సమ్మారెడ్డి, కాశీనాథ్‌యాదవ్, చిన్నోళ్ల శ్రీనివాస్, గుడ్ల శ్రీనివాస్, శివరాజ్‌గౌడ్, పాండుగౌడ్, బోయ కిషన్, దుర్గేష్, మధులత తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ టీచర్‌కు రూ.60వేల చెక్కు అందజేత



ప్రైవేట్ టీచర్ రవళికి చెక్కు అందజేస్తున్న దాతలు సురేష్ చంద్ర, సువర్ణరాణి

మోతీనగర్: పర్వత్‌నగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, పట్టణ ఆరోగ్య కేంద్రంలో దాతల సహకారంతో అభివృద్ధి చేస్తున్నామని పర్వత్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మహమ్మద్ జాహెద్ షరీఫ్ బాబా పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థులకు బోధించడానికి రవళిని సంవత్సరం పాటు వలంటీర్‌గా నియమించినందుకు రూ.60 వేలను పర్వత్‌నగర్‌కు చెందిన సురేష్ చంద్ర, సువర్ణరాణి దంపతులు మంగళవారం అందజేశారు.

◆ ఈ సందర్భంగా బాబా మాట్లాడుతూ.. విద్యార్థుల సంఖ్య ఎక్కువ ఉన్నప్పటికి ప్రభుత్వ ఉపాధ్యాయుల కొరత ఉందన్నారు. దాతలు ముందుకు వచ్చి బోధనా తరగతులకు వలంటీర్లను నియమించుకోవటానికి సహకారం అందించాలని సూచించారు. అదే విధంగా ప్రభుత్వ ఆస్పత్రిలో మౌలిక సదుపాయాలు కల్పించడానికి దాతలు ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం యాదయ్య, సంక్షమ సంఘం ప్రధాన కార్యదర్శి సి.సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలి



కూకట్‌పల్లి వై జంక్షన్‌లో నిరాహారదీక్షలో పాల్గొన్న మాదిగ నాయకులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి వై జంక్షన్‌లో 18 నుంచి 22 వరకు జరిగే ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలలో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలని మంగళవారం నిరాహారదీక్షలు చేపట్టారు. రాష్ట్ర నాయకులు టీవీ వాసుదేవ్ మాదిగ, రాష్ట్ర నాయకులు ముత్యపాగ శ్రీనివాస్‌మాదిగ, జగదీష్ మాదిగ, నందు మాదిగ, నాగేష్ మాదిగ, ఇంజమురి యాదగిరి మాదిగ, గౌరి శ్రీనివాస్ మాదిగ, పుట్టపాక నాగేందర్ మాదిగ, పట్నం రమేష్ మాదిగ, బాలకృష్ణమాదిగ, అజయ్ మాదిగ, సాయిలు మాదిగలు దీక్షలో పాల్గొన్నారు.

'రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు గుణపాఠం చెబుతారు'

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ మహంకాళి నగర్‌లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురభి రవీందర్ చేస్తున్న మార్పు కోసం బీజేపీ పాదయాత్రలో మంగళవారం బీజేవైఎం నేషనల్ ఆఫీస్ కోఆర్డినేటర్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పలు అభివృద్ధి కార్యక్రమాల పేరిట శంకుస్థాపనలు చేసి నెలలు గడుస్తున్నా అభివృద్ధికి నోచుకోలేదన్నారు. పలు బస్తీల్లో రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి లైన్లు పనులు అలాగే ఉన్నాయన్నారు. తొమ్మిది వేల కోట్ల అభివృద్ధి ఎక్కడ చేశారని ఎమ్మెల్యేను ప్రశ్నించారు. ప్రజలు వాస్తవాలను గమనిస్తున్నారని రానున్న ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్ పార్టీకి గుణపాఠం చెబుతారన్నారు.



శంకుస్థాపన చేసిన శిలాఫలకం వద్ద ఎమ్మెల్యేను ప్రశ్నిస్తున్న బీజేపీ నాయకులు

అంబేడ్కర్ అమరజ్యోతి అసోసియేషన్ నూతన కమిటీ

మూసాపేట: మూసాపేటలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అమర జ్యోతి అసోసియేషన్ నూతన కార్యవర్గ కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడు పాతపల్లి కృష్ణ, జనరల్ సెక్రటరీ కర్ర సాయిప్రసాద్, సలహాదారులు కర్క స్వామి, రామకృష్ణ, జిల్లా రాము, చీఫ్ ఉపాధ్యక్షుడు జెల్లా సురేష్, శివకుమార్, మల్లేష్, ఉపాధ్యక్షులు విజయ్, నర్సింగ్‌రావు, కర్క రామ్‌కుమార్, కోశాధికారి కర్క నర్సయ్య, జాయింట్ సెక్రటరీలు శేఖర్, దశరథ్, నిఖిల్, ఆర్గనైజింగ్ సెక్రటరీలు రాము, చిన్న సాయి, సాయిను ఎన్నుకున్నారు. కాలనీ అభివృద్ధికి తామంతా కృషి చేస్తామన్నారు. కాలనీవాసులకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.



నూతన కార్యవర్గ కమిటీ సభ్యులు

పార్కు అభివృద్ధి పనుల పరిశీలన

మోతీనగర్: గాయత్రినగర్ లైబ్రరీ పార్కులో మంగళవారం కార్పొరేటర్ సబిహా బేగం పార్కు అభివృద్ధి పనులను పరిశీలించారు. పచ్చదనం కోసం మొక్కలను నాటేందుకు ఎర్రమట్టి పనులను పర్యవేక్షించి పలు సూచనలు చేశారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంజీవరెడ్డి, యోగిరాజు, సమీన, తదితరులు పాల్గొన్నారు.

ఇండియా ఈబీ–5 పెట్టుబడులపై ప్రత్యేక దృష్టి

- ఐఐయూఎస్‌ఏ అధ్యక్షుడు అరోన్‌గ్రా
- హైదరాబాద్ నాలెడ్జి సిటీలో 'ఇండియా ఈబీ–5 పాస్‌పోర్ట్ రోడ్డు షో సిరీస్'



ఐటీసీ కోహినూర్‌లో విలేకరులతో మాట్లాడుతున్న ఐఐయూఎస్‌ఏ అధ్యక్షుడు అరోన్‌గ్రా తదితరులు

రాయదుర్గం: ఐఐయూఎస్‌ఏ పాస్‌పోర్టు సిరీస్ ద్వారా అమెరికాలో పెట్టుబడులకు ప్రత్యేకించి ఈబీ–5 ఇమ్మిగ్రెంట్ ఇన్వెస్టర్ ప్రోగామ్ భారతీయ పెట్టుబడిదారులకు అండగా ఉంటుందని ఐఐయూఎస్‌ఏ అధ్యక్షుడు అరోన్‌గ్రా పేర్కొన్నారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని ఐటీసీ కోహినూర్‌లో ఇన్వెస్ట్ ఇన్ యూఎస్‌ఏ(ఐఐయూఎస్‌ఏ), పీహెచ్‌డీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(పీహెచ్‌డీసీసీఐ) సంయుక్త ఆధ్వర్యంలో ఇండియా ఈబీ–5 పాస్‌పోర్ట్ రోడ్డు షో సిరీస్ కార్యక్రమాన్ని ఐఐయూఎస్‌ఏ డైరెక్టర్ ఆఫ్ ఈవెంట్స్, బిజినెస్ డెవలప్‌మెంట్ మెకెంజీ పెంటన్, పీహెచ్‌డీ సీసీఐ ఇంటర్నేషనల్ అఫైర్స్, ట్రేడ్ ఫెయిర్ డివిజన్ మయాంక్ చత్వాల్ మంగళవారం ప్రారంభించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇమ్మిగ్రేషన్ అవకాశాలపై పెరుగుతున్న ఆసక్తికి ఇది నిదర్శనమన్నారు. ఐఐయూఎస్‌ఏ పాస్‌పోర్ట్ సిరీస్ భారతీయ పెట్టుబడిదారుల మధ్య సంభాషణలు, కనెక్షన్ల సులభతరం చేయడానికి కృషి చేస్తున్నామన్నారు.

ఘనంగా దుర్గాభవానీ ఆలయ వార్షికోత్సవం



అన్న ప్రసాద వితరణలో పాల్గొన్న భక్తులు

ఓల్డ్ బోయిన్‌పల్లి: భవానీనగర్‌లోని దుర్గాభవానీ అమ్మవారి ఆలయం వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారి వీరేశం శర్మ ఆధ్వర్యంలో గణపతి పూజ, పుణ్యావాచనం, నవగ్రహ అరాధన, 108 కలశాలతో అమ్మవారికి అష్టోత్తర కలశాభిషేకం, సహస్ర పుష్పార్చన, దేవి హోమం, శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఆయనకు తీర్థప్రసాదాలు అందజేసి సన్మానించారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్

అభయాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు



ఆల్విన్‌కాలనీ: ఆల్విన్ కాలనీ భ్రమరాంబ మల్లికార్జునస్వామి దేవాలయంలో శ్రావణ మంగళవారం పూజలు నిర్వహించారు. ఆలయంలో కొలువుదీరిన అభయాంజనేయ స్వామికి వడమాలతో పూజలు చేశారు. ఆంజనేయ దండకం, సింధూరం పూజ, ప్రత్యేక అర్చనలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీరామకోటి పఠించారు. ఆలయ ధర్మకర్త శ్యామల భాస్కర్‌రెడ్డి, అర్చకుడు అఖిలేశ్వర శర్మ పాల్గొన్నారు.

16న 'ఎంపవరింగ్ ది ఫ్యామిలీ' ముగింపు

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థలోని విమెన్స్ వింగ్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన 'ఎంపవరింగ్ ది ఫ్యామిలీ' కార్యక్రమం ముగింపు కార్యక్రమాన్ని ఈనెల 16వ తేదీన ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు గచ్చిబౌలి శాంతిసరోవర్‌లోని గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ప్రత్యేక ఉపన్యాస, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040–23001234లో సంప్రదించవచ్చు.


ఓటరు నమోదుపై అవగాహన

ఐటీ సంస్థల్లో పర్యటించిన జీహెచ్ఎంసీ అధికారులు



రాయదుర్గం: జీహెచ్ఎంసీ శేరిలింగంపల్లి సర్కిల్ అధికారులు ఓటరు నమోదు ప్రక్రియపై మంగళవారం అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. గచ్చిబౌలి, నానక్‌రాంగూడలోని ఐటీ సంస్థల్లో అధికారులు, ఐటీ ఉద్యోగులతో సమావేశమై ఓటరు నమోదు, అడ్రస్, పేర్ల మార్పు వంటి అంశాలపైనే కాకుండా ఓటరు లిస్టులో పేరు ఉందా...? లేదా...? అనే అంశాన్ని పరిశీలించారు. జీహెచ్ఎంసీ శేరిలింగంపల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి, ఏఎంసీ నరేందర్‌రెడ్డిల ఆధ్వర్యంలో సిబ్బంది గచ్చిబౌలిలోని డీఎల్ఎఫ్ భవనంలోని ఐటీ సంస్థలు, నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని అమెజాన్ ఐటీ సంస్థతో పాటు హనీవెల్ సంస్థలో అక్కడి అధికారులతో కలిసి ఉద్యోగులకు అవగాహన కల్పించారు.

ఉర్దూలో బహుభాషా పదకోశం అవసరం



రాయదుర్గం: ఉర్దూలో విభిన్న అంశాలకు సంబంధించిన బహుభాషా పదకోశం అవసరం...అలాంటి ప్రయత్నాలకు 'మనూ' ఎల్లప్పుడూ మద్దతు ఇస్తుందని ఉర్దూ విశ్వవిద్యాలయ వీసీ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో రాజనీతి శాస్త్రం యొక్క త్రిభాషా పదకోశం (ఇంగ్లిష్, ఉర్దూ, హిందీ) తయారీ కోసం కమిషన్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ టెక్నికల్ టెర్మినాలజీ(సీఎస్‌టీటీ) కేంద్ర విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఐదు రోజుల వర్క్‌షాప్ ప్రారంభ సెషన్‌లో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సీఎస్‌టీటీ చైర్మన్ ప్రొఫెసర్ గిరీష్‌నాథ్‌ఝా, ప్రొఫెసర్ ఇంతియాజ్ హస్నేన్, షాజాద్ ఆలమ్ అన్సారీ, ప్రొఫెసర్ అఫ్రోజ్ ఆలమ్, డాక్టర్ ఖుర్షీద్ ఆలమ్ తదితరులు ప్రసంగించారు.